BREAKING EDITION
బ్రేకింగ్ ఎడిషన్

Follow: @ANNTELUGU

# మహా పత్రిక

శుక్రవారం, హైదరాబాద్ 07-02-2025

WWW.EPAPER.MAHAADAILY.COM

ANN తెలుగు



## మహా కుంభమేళాలో మళ్లీ అగ్నిప్రమాదం

■ ఒక్కసారిగా చెలరేగిన మంటలు..పరుగులు తీసిన జనం

**మహా:** మహా కుంభమేళాలో మళ్లీ అగ్నిప్రమాదం సంభవించింది. సెక్టార్18 శంకరాచార్య మార్గంలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. మంటల్లో అక్కడ ఏర్పాటు చేసిన పలు టెంట్లు కాలిపోయాయి. అగ్నిప్రమాదం గురించి సమాచారం అందుకున్న వెంటనే అగ్నిమాపక సిబ్బంది అప్రమత్తమయ్యారు. అగ్నిమాపక యంత్రాల సాయంతో మంటలను అదుపు చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. ఈ ఘటనలో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదని తెలుస్తోంది. కుంభమేళాలో వరుస ప్రమాదాలు ఆందోళన కలిగిస్తున్నాయి. ప్రపంచంలోనే అతిపెద్ద ఆధ్యాత్మిక ఉత్సవంలో ఇలాంటి ఘటనలు టెన్షన్ కలిగిస్తున్నాయి. మౌని అమావాస్య సందర్భంగా జనవరి 29వ తేదీన కుంభమేళాలో తొక్కిసలాట చోటుచేసుకుంది. ఆ ఘటనలో 30కి పైగా మంది ప్రాణాలు కోల్పోయారని, సుమారు 60 మంది గాయపడ్డారని సమాచారం. తాజాగా శంకరాచార్య మార్గంలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. కుంభమేళా మొదలైనప్పటి నుంచి ఇప్పటిదాకా అగ్నిప్రమాదం చోటుచేసుకోవడం ఇది నాలుగోసారి. త్రివేణి సంగమంలో పుణ్యస్నానాల కోసం కోట్లలో భక్తులు తరలివస్తున్న నేపథ్యంలో ఇలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా అధికారులు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

# మల్లికార్జున ఖర్గేతో సీఎం రేవంత్ భేటీ

■ భేటీలో పాల్గొన్న భట్టి విక్రమార్క, ఉత్తమ్ కుమార్ రెడ్డి, మహేశ్ కుమార్ గౌడ్

■ పీసీసీ కార్యవర్గంపై చర్చించిన నేతలు

గజ్వేల్‌లో నిర్వహించబోయే ఎస్సీ వర్గీకరణ సభకు ఖర్గేకు ఆహ్వానం



**మహా, బ్రేకింగ్ బ్యూరో:** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీ పర్యటనలో భాగంగా ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేతో సమావేశమయ్యారు. ఈ సమావేశంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ పీసీసీ కార్యవర్గంతో పాటు పలు అంశాలపై ఖర్గేతో చర్చించారు. ఎస్సీ వర్గీకరణ, కుల గణన అంశాలపై వారి మధ్య చర్చ జరిగింది. తెలంగాణలో ఎస్సీ వర్గీకరణను అమలు చేయాలని నిర్ణయించినట్లు ఖర్గేకు వెల్లడించారు. సూర్యాపేటలో ఈ నెలలో నిర్వహించనున్న బీసీ కుల గణన బహిరంగ సభకు రాహుల్ గాంధీని ఆహ్వానిస్తున్నట్లు చెప్పారు. అలాగే ఎస్సీ వర్గీకరణకు సంబంధించి ఏప్రిల్‌లో గజ్వేల్‌లో సభ నిర్వహిస్తున్నామని, ఈ సభకు రావాలని ఖర్గేను ముఖ్యమంత్రి కోరారు.

## కాంగ్రెస్‌తోనే బీసీలకు న్యాయం

### సీఎం రేవంత్‌రెడ్డి బీసీ పక్షపాతి: వీహెచ్



**మహా:** కాంగ్రెస్ పాలనలోనే బీసీలకు పూర్తి న్యాయం జరుగుతోందని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బీసీ పక్షపాతి అని కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ ఎంపీ వి.హనుమంతరావు అన్నారు. ఆయన శుక్రవారం గాంధీభవన్‌లో మీడియాతో మాటాడారు. కులగణన చేసి బీసీలకు మేము న్యాయం చేస్తున్నామని, ఈ క్రమంలోనే సూర్యాపేటలో రాహుల్ గాంధీతో సభ పెడుతున్నామని చెప్పారు. ఎస్సీ రిజర్వేషన్ చేసినందుకు గజ్వేల్‌లో మలికార్జున ఖర్గేతో సభ పెడుతున్నట్లు స్పష్టం చేశారు. కుల గణన అంశంపై మీడియాతో మాట్లాడటం కాదు ప్రజల్లోకి పోవాలని సీఎం రేవంత్ రెడ్డి చెప్పినట్లు చెప్పారు. కేంద్ర ప్రభుత్వం క్రిమిలేయర్‌ను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ఎక్కడ ఎవరికి అన్యాయం జరిగినా తాను అక్కడికి వెళ్లి న్యాయ పోరాటం చేస్తున్నట్లు చెప్పారు. బీసీల సంక్షేమం కేంద్రానికి పట్టడంలేదని వీహెచ్ అన్నారు.

**నేటికీ క్షమాపణ చెప్పని అమిత్‌షా**

అంబేడ్కర్‌ను అవమానించిన కేంద్రమంత్రి అమిత్ షా ఇప్పటి వరకు క్షమాపణ చెప్పలేదని అన్నారు. అంబేడ్కర్‌ను బదులు దేవున్ని పూజిస్తే స్వర్గానికైనా వెళ్తారని రాజ్యసభలో అమిత్ షా అంటూ అవమానించారని మండిపడ్డారు. అయోధ్యలో గుడి కట్టిన తర్వాతే నిజమైన స్వాతంత్ర్యం వచ్చిందని మోహన్ భగవత్ అన్నారని గుర్తుకు చేశారు. రాహుల్ గాంధీ కుటుంబం ఎన్నో త్యాగాలు చేసిందని, వాళ్లను కూడా అవమాన పరుస్తున్నారని తెలిపారు.




# హస్తినలో ఎమ్మెల్యేల మకాం

**మహా:** మంత్రివర్గ విస్తరణ, పార్టీ కమిటీల ఏర్పాటుపై క్లారిటీ రానున్న నేపథ్యంలో కాంగ్రెస్ ఎమ్మెల్యేలంతా హస్తినలో మకాం వేశారు. ఏఐసీసీ పెద్దలతో మంతనాలు జరుపుతున్నారు. మరోవైపు మంత్రివర్గం విస్తరణలో కొత్త వారికి ఛాన్స్ ఇస్తారా? లేక పాత వారిని మళ్లీ తీసుకుంటారా? అనే చర్చ జోరుగా సాగుతోంది. గురువారం సాయంత్రం ఢిల్లీ సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి, పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్, మంత్రులు, కొందరు ఎమ్మెల్యేలు ఢిల్లీ వెళ్లిన విషయం విదితమే. సీఎం రేవంత్‌రెడ్డి శుక్రవారం ఉదయం ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పలు అంశాలు చర్చకు వచ్చినట్లు సమాచారం. కులగణన, వర్గీకరణపై ఖర్గేకు వివరించారు. కులగణన సర్వే నివేదికను సమగ్ర సమాచారం సేకరించి శాస్త్రీయంగా నివేదిక తయారు చేశామన్నారు. ఎస్సీ వర్గీకరణ అంశంపై సబ్ కమిటీ, జ్యుడిషియల్ కమిటీ అనంతరం కేబినెట్‌లో ఆమోదించడం జరిగిందని తెలిపారు. రెండు దశాబ్దాలుగా ప్రజలు కోరుకుంటున్న అంశాలు ఇవేనని వివరించారు. కార్యవర్గం ఏర్పాటుపై సుదీర్ఘ చర్చ ఇదిలా ఉండగా.. గురువారం రాత్రి ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌తో సమావేశమయ్యారు సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి. ఈ సందర్భంగా కులగణన జరిగిన తీరును సీఎం రేవంత్ వివరించారు. పార్టీ కార్యవర్గాన్ని నియామకం గురించి చర్చ జరిగింది. కార్యవర్గం, ఆఫీసు బేరర్లు, ఎవరెవరిని నియమించాలన్న దానిపై సుదీర్ఘంగా చర్చించినట్టు పార్టీ వర్గాల సమాచారం. స్థానిక సంస్థల ఎన్నికలపైనా చర్చ జరిగినట్టు తెలుస్తోంది. దశలవారీగా ఈ ప్రక్రియను పూర్తి చేయాలని పార్టీ నిర్ణయించినట్టు సమాచారం. మరోవైపు ఈ వారంలో పీసీసీ కార్యవర్గాన్ని హైకమాండ్ ప్రకటిస్తుందన్నది పీసీసీ చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్ వెల్లడించారు.



## పిట్టల్లా రాలిపోతున్న రైతులు

### బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఫైర్



**మహా:** రాష్ట్రంలో రైతులు పిట్టల్లా రాలిపోతున్నా రేవంత్ సర్కార్‌కు పట్టడంలేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ , మాజీ మంత్రి కేటీఆర్ ఫైర్ అయ్యారు. రేవంత్ రెడ్డి సర్కార్ పై సోషల్ మీడియా ఎక్స్ వేదికగా తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. ‘‘420 అబద్ధపు హామీల పాపం.. 420 రోజుల చేతకాని పాలన శాపం.. ఫలితంగా.. మాటలకందని మహావిషాదం.. తెలంగాణ చెల్లించిన భారీ మూల్యం.. 420 మంది రైతన్నల బలవన్మరణం.. అసమర్థులు అధికారం పీఠమెక్కి.. అన్నదాతలను బలిపీఠం ఎక్కిస్తున్నారు’’.. అంటూ కేటీఆర్ కామెంట్స్ చేశారు. కన్నీటి సేద్యం చేయలేక.. భూములున్న కర్షకులే కాదు.. కౌలు రైతులూ పిట్టల్లా రాలిపోతున్నారని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. దేశానికే వెన్నుముకైన రైతులకు... కుటిల కాంగ్రెస్ పాలనలో వరుస వెన్నుపోట్లు పొడుస్తున్నారని, ఓట్లనాడిచ్చిన హామీలకు లెక్కలేనన్ని తూట్లు పొడుస్తున్నారని దుయ్యబట్టారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో పంజాబ్‌నే తలదన్నే స్థాయికి తెలంగాణను తీసుకువస్తే.. ఇప్పుడు పెట్టుబడికి పత్తాలేదు.. దిగుబడికి దిక్కులేదంటూ ఆయన విమర్శించారు. రుణమాఫీని ఆగంచేసి.. పెట్టుబడి సాయానికి పాతరేసి.. ముంచేరోజులు తేవడంవల్లే ఈ అనర్థాలని కేటీఆర్ అన్నారు. చలనం లేని సీఎం, బాధ్యత లేని సర్కారు వల్లే.. మళ్లీ తెలంగాణ పల్లె కన్నీరుపెడుతోందన్నారు. మళ్లీ మరణమృదంగం మోగుతోందని.. ఈ ప్రభుత్వానికి చేతనైతే.. ఇకనైనా సాగు సంక్షోభాన్ని తీర్చాలని.. అన్నదాతల ఆత్మహత్యల పరంపరను ఆపాలని కేటీఆర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.



కుటుంబ సమేతంగా ప్రధాని మోదీని కలిసేందుకు పార్లమెంటుకు వచ్చిన అక్కినేని నాగార్జున, అమల, నాగచైతన్య, శోభిత ధూళిపాళ

## తండేల్..హిట్ టాక్

■ నాగచైతన్య, సాయిపల్లవి పెర్ ఫార్మెన్స్ కు మంచి మార్కులు..దేవిశ్రీప్రసాద్ సూపర్ మ్యూజిక్

ఫస్ట్ హాఫ్ ఓకే.. సెకండాఫ్ అదుర్స్ అంటున్న నెటిజన్లు



**మహా:** టాలీవుడ్ హీరో నాగచైతన్య, సాయిపల్లవి కాంబినేషన్‌లో తెరకెక్కిన లేటెస్ట్ మూవీ 'తండేల్'. మత్స్యకారుల బ్యాక్‌డ్రాప్‌లో ఓ ఫీల్ గుడ్ మూవీగా ఇది శుక్రవారం ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఈ చిత్రాన్ని చూసిన ఆడియెన్స్ సోషల్ మీడియా వేదికగా తమ అభిప్రాయాలను తెలియజేస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమాకు ప్రేక్షకుల నుంచి పాజిటివ్ రెస్పాన్స్ వస్తోంది. సాయి పల్లవి , చైతూ జోడీ బాగుందని, ఇది ఓ డీసెంట్ లవ్ స్టోరీ అని అంటున్నారు. దేవీశ్రీ ప్రసాద్ సంగీతం ఈ సినిమాకు హైలైట్‌గా నిలిచిందని ఓ నెటిజన్ పేర్కొన్నారు. నాగ చైతన్య యాక్టింగ్ వేరే లెవెల్‌లో ఉందని, తన నుంచి ఇది అస్సలు ఎక్స్‌పెక్ట్ చేయలేదని అంటున్నారు. తన ట్రాన్స్‌ఫార్మేషన్ కూడా చాలా బాగుందని అంటున్నారు. ఇక ఇందులో ఫస్ట్ హాఫ్ ఫర్వాలేదనిపించినప్పటికీ, సెకెండాఫ్ అదిరిపోయిందని అంటున్నారు. డీఎస్‌పీది ఇది బెస్ట్ ఆల్బమ్ అని కామెంట్ చేస్తున్నారు.

**ఇదీ స్టోరీ**

శ్రీకాకుళం జిల్లా డి మత్స్యలేశం గ్రామంలో జరిగిన సంఘటనల ఆధారంగా ఈ చిత్రం రూపొందింది. వేటకు వెళ్లిన పలువురు మత్స్యకారులు పాకిస్థాన్ కోస్ట్ గార్డుకు చిక్కి రెండేళ్లు జైలు శిక్ష అనుభవించిన స్టోరీ లైన్‌పై ఈ సినిమాను తెరకెక్కించారు. గతంలో ఎన్నడూ చేయని సరి కొత్త పాత్రలో చైతూ, డీగ్లామర్ లుక్‌లో సాయి పల్లవి కనిపించనున్నారు. దేవి శ్రీ ప్రసాద్ ఈ చిత్రానికి మంచి సంగీతాన్ని అందించారు. ఈ సినిమాకు అల్లు అరవింద్ నిర్మాత. ఇప్పటికే ఈ సినిమా నుంచి విడుదలైన పాటలు, ట్రైలర్ ప్రేక్షకులను ఆకట్టుంది. అలాగే సినిమాపై మరింత అంచనాలను పెంచేశాయి. తెలుగుతో పాటు తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో ఈ సినిమా విడుదలైంది.

## దళితుల తలరాత మార్చిన రేవంత్




■ వర్గీకరణ నిర్ణయంతో సర్వత్రా హర్షా తిరేకాలు

■ ఏఐసీసీ సెక్రటరీ సంపత్ కుమార్

**మహా:** ఎస్సీ వర్గీకరణపై కాంగ్రెస్ ప్రభుత్వ నిర్ణయం చరిత్రాత్మకమని, 62 లక్షల మంది దళితులు సంతోషంగా ఉన్నారని ఏఐసీసీ సెక్రటరీ సంపత్ కుమార్ అన్నారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఐదు తరాల సమస్యకి రేవంత్ ముగింపు పలికారని అన్నారు. కాంగ్రెస్ తీసుకున్న నిర్ణయం తల రాతలను మారుస్తున్నదని అన్నారు. వర్గీకరణపై కొంతమంది కావాలని అపోహలు సృష్టిస్తున్నారని మండిపడ్డారు. రాజకీయం కోసం కాంగ్రెస్ నేతలపై విమర్శలు చేయడం మంచిది కాదన్నారు. రేవంత్ మంచి నిర్ణయంతో దళితుల్లో గుండె ధైర్యం వచ్చిందన్నారు. అపోహల సంఘం చేస్తున్న అబద్ధాలను నమ్మవద్దని ఆయన సూచించారు. సామాజిక న్యాయానికి, అంబేద్కర్ స్ఫూర్తికి కాంగ్రెస్ కట్టుబడి ఉందన్నారు. వర్గీకరణ ప్రక్రియలో చిన్న పొరపాటు చూపెట్టినా దేనికైనా సిద్ధం అని సంతప్‌కుమార్ సవాల్ విసిరారు. వర్గీకరణపై కేసీఆర్, పీఎం మోదీ డ్రామాలాడుతున్నారని ఆరోపించారు.

## బాలికపై గ్యాంగ్‌రేప్

నార్సింగి పీఎస్ పరిధిలో ఘటన



**మహా:** తెలంగాణలో మరో దారుణం చోటుచేసుకుంది. రంగారెడ్డి జిల్లా నార్సింగి పోలీస్ స్టేషన్ పరిధిలోని హైదర్‌షా కోట్ లో ఓ బాలికపై అయిదుగురు యువకులుసామూహిక అత్యాచారానికి పాల్పడిన ఘటన వెలుగులోకి వచ్చింది. ఈ విషయం ఎక్కడైనా చెబితే చంపేస్తామని ఆ బాలికను బెదిరించారు. ఎట్టకేలకు అసలు విషయం బయటకు పొక్కటంతో నార్సింగ్ పోలీస్ స్టేషన్ లో బాధితురాలు సహా కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు యువకులపై పోక్సో చట్టం కింద కేసు దర్యాప్తు చేపట్టినట్టు ప్రాథమికంగా తెలుస్తోంది.

## జగన్ వర్సెస్ విజయసాయిరెడ్డి

ఇద్దరి మధ్య మాటల యుద్ధం



**మహా:** వైసీపీ అధినేత జగన్, ఆ పార్టీ మాజీ నేత, మాజీ రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డికి మధ్య ప్రచ్ఛన్న యుద్ధం మొదలైనట్టే కనిపిస్తోంది. రాజకీయాల్లో విజయసాయిరెడ్డికైనా, మరెవరికైనా సరే విశ్వసనీయత ఉండాలంటూ నిన్న జగన్ వ్యాఖ్యానించిన సంగతి తెలిసిందే. భయంతోనే, ప్రలోభాలకు లొంగిపో కూడదని ఆయన వ్యాఖ్యానించారు. జగన్ చేసిన ఈ వ్యాఖ్యలకు విజయసాయిరెడ్డి తాజాగా ఘాటుగా కౌంటర్ ఇచ్చారు. 'వ్యక్తిగత జీవితంలో కూడా విలువలు, విశ్వసనీయత, క్యారెక్టర్ ఉన్న వాడిని కాబట్టే, ఎవరికి, ఎలాంటి ప్రలోభాలకి లొంగలేదు. భయం అనేది నాలో ఏ అణువు అణువులోను లేదు కాబట్టే రాజ్యసభ పదవిని, పార్టీ పదవుల్ని, రాజకీయాలనే వదులుకున్నా' అని ట్వీట్ చేశారు. విజయసాయి ట్వీట్ ప్రస్తుతం వైసీపీ శ్రేణుల్లో చర్చనీయాంశంగా మారింది.